నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, మంగళవారం 27 ఫిబ్రవరి 2024 | SURYAPET

గుర్రంపోడ్ : చామలేడు ఉమామహేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

దైవ చింతన అలవర్చుకోవాలి

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

గుర్రంపోడ్, ఫిబ్రవరి 26 : ప్రతి ఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చామలేడు గ్రామంలో పంచాయతన ఉమామహేశ్వర స్వామి, దుర్గమ్మ, గౌరమ్మ దేవతల విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్, ఎంపీపీ మంచికంటి వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ గాలి సరితా రవికుమార్, వైస్ ఎంపీపీ వజ్జ రామేశ్వరీధనుంజయ్, ఎంపీటీసీ దోటి చంద్రమౌళి, నాయకులు పాల్గొన్నారు.

అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా నల్లగొండ రైల్వే స్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, పక్కన ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, రైల్వే అధికారులు

రైల్వే స్టేషన్లలో అన్ని సౌకర్యాలు కల్పించాలి

- అండర్ పాస్‌ల వద్ద నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలి
- ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్
- నల్లగొండలో అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద అభివృద్ధి పనులు ప్రారంభం
- వర్చువల్‌గా శ్రీకారం చుట్టిన ప్రధాని మోదీ

నల్లగొండ సిటీ, ఫిబ్రవరి 26 : జిల్లా నుంచి డబ్లింగ్ రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని, రైల్వే స్టేషన్‌లలో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద నల్లగొండ రైల్వే స్టేషన్‌ను ఆధునీకరించే కార్యక్రమాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారం వర్చువల్‌గా ప్రారంభించగా ఎంపీ బడుగులతోపాటు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, రైల్వే డీజీఎం ప్రదీప్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బడుగుల మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల క్రితం ఏర్పడిన నల్లగొండ రైల్వే స్టేషన్‌ను రూపురేఖలు అమృత్ భారత్ స్టేషన్ పథకం ద్వారా మారనున్నాయన్నారు. జిల్లాలో రెండు రైల్వే స్టేషన్లను అమృత్ పథకం కింద ఎంపిక చేయడం సంతోషకరమని తెలిపారు. జిల్లా మీదుగా నడికుడి వరకు రైల్వే లైన్ డబ్లింగ్ కోసం తాము పార్లమెంట్‌లో పోరాటం చేశామని గుర్తు చేశారు. జిల్లాలో పెద్ద స్టేషన్‌లు అయిన నల్లగొండ, మిర్యాలగూడలో అన్ని రైళ్లను నిలుపుదల చేయాలని కోరారు. వర్షాలు కురిసినప్పుడు రైల్వే అండర్ పాస్‌లలో నీరు నిలిచి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, అలాంటి వాటి చోట్ల ఫ్లైఓవర్లు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే స్టేషన్‌ల అభివృద్ధి కోసం అమృత్ పథకం కింద ఇప్పుడు మంజూరైన నిధులు సరిపోవని,మరో రూ.10 కోట్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో రైల్వే కమర్షియల్ సూపరింటెండెంట్ దేవా సింగ్, స్టేషన్ మేనేజర్ సుధాకర్‌బాబు, కేంద్రీయ విద్యాలయ పిన్సిపాల్ శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్‌రెడ్డి, గోలి మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో..

మిర్యాలగూడ : మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లోనూ అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ప్రధాని నరేంద్ర మోదీ అభివృద్ధి పనులను వర్చువల్‌గా ప్రారంభించగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అమృత్ పథకంలో మిర్యాలగూడ స్టేషన్‌ను ఎంచుకున్నందుకు సంతోషంగా ఉందని వారన్నారు. ప్రతి రోజూ మిర్యాలగూడ నుంచి సుమారు 3వేల మంది రైలు ప్రయాణం చేస్తుంటారని, ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని వసతులు కల్పించాలని కోరారు. రైళ్లలో సీనియర్ సిటిజన్స్‌కు 30శాతం డిస్కౌంట్ ఇంకా అమలు కావడం లేదని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, రైల్వే స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సోమవారం అధ్యాపకుల అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సూర్యాపేట డీఐఈఓ కృష్ణయ్య

రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

- సూర్యాపేట జిల్లాలో 32 సెంటర్లు
- ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- హాజరుకానున్న 16,602 మంది విద్యార్థులు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- ఇంటర్‌నెట్ నుంచి హాల్ టికెట్ తీసుకునే సదుపాయం

సూర్యాపేట అర్బన్, ఫిబ్రవరి 26 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభం కానున్నాయి. ఈ నెల 28 నుంచి మార్చి 14 వరకు జరిగే పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 32 పరీక్షా కేంద్రాల్లో ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులు మొత్తం 16,602 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. పరీక్షా కేంద్రాలను సీసీ కెమెరాలతో పర్యవేక్షించనున్నారు. నిమిషం నిబంధన ఈసారి కూడా కొనసాగుతున్నది. ప్రతి పరీక్షా కేంద్రంలో అవసరమైన మెడికల్ సదుపాయాలతోపాటు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నారు.

16,602 మంది విద్యార్థులు

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల్లో జనరల్, ఓకేషనల్ విద్యార్థులు మొత్తం 16,602 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. వారిలో ఫస్టియర్ విద్యార్థులు 8,285 మంది, సెకండియర్ విద్యార్థులు 8,317 మంది. పరీక్ష ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఉండగా, విద్యార్థులను 8 గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు.

ఇంటర్‌నెట్‌లో హాల్ టికెట్లు

ప్రైవేట్ కళాశాలలు హాల్ టికెట్లు ఇవ్వని విద్యార్థులు నేరుగా ఇంటర్‌నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇందుకు సంబంధించిన ఆదేశాలను పరీక్షల నిర్వహణ కేంద్రాలకు ఉన్నతాధికారులు ఇప్పటికే జారీ చేశారు. విద్యార్థులు tsbie.cgg.gov.in వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

పరీక్షల నిర్వహణకు సిబ్బంది

జిల్లాలో ఇంటర్ పరీక్షల కోసం అవసరమైన అధికారులకు విధులను కేటాయిస్తూ జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు అదేశాలు జారీ చేశారు. ప్రతి సెంటర్‌కు ఒక సూపరింటెండెంట్ చొప్పున జిల్లాలో 32 మందిని నియమించారు. వారితో పాటు మరో 32 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ముగ్గురు సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. గ్రామాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేస్తున్నారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి

పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇంటర్‌నెట్ ద్వారా హాల్ టికెట్ పొందిన విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించేలా బోర్డు నిర్ణయం తీసుకున్నది. బోర్డు నిబంధనల ప్రకారం నిర్ణీత సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. మాస్ కాపీయింగ్ జరుగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

–జానపాటి కృష్ణయ్య, ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి, సూర్యాపేట

యోగానందుడి గరుడోత్సవం

గరుడోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

అర్వపల్లి, ఫిబ్రవరి 26 : యోగానంద లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అర్ధరాత్రి గరుడోత్సవాన్ని నిర్వహించారు. విశేష పుష్పార్చన, ఆదిత్య హృనతు పారాయణం, వికనస మహర్షి విశేషార్చన కార్యక్రమాలను జరిపించారు. స్వామి అమ్మవార్లను పల్లకిలో ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మోరపాక సత్యం, అర్చకుడు రాంబాబు, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

నిర్వహణ లోపం.. రైతులకు శాపం

- ఐదేండ్లలో తొలిసారి ఎండుతున్న కాళేశ్వరం ఆయకట్టు
- సూర్యాపేట జిల్లాలో వట్టిపోతున్న చెరువులు.. అడుగంటిన బోర్లు, బావులు
- కేసీఆర్ సర్కారులో ప్రణాళికాబద్ధంగా నీటి విడుదల



నడిగూడెం మండలం కేశవాపురంలో నీళ్లు లేక ఎండిన వరి

సూర్యాపేట, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) : నదీ జలాల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అవడం రైతులకు శాపంగా మారుతున్నది. గతేడాది వరకు కాల్వల ద్వారా 2,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా ఇప్పుడు 1800 క్యూసెక్కులకు మించి విడుదల చేయడం లేదు. దాంతో చివరి ఆయకట్టుకు నీరు అందే పరిస్థితి లేదు. అలాగే చెరువులను కూడా నింపకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి పోతూ వేసిన పంటలు ఎండిపోతున్నాయి. ఈ దుస్థితిలో ఎండిన పంటలను రైతులు పశువుల మేతకు వదిలేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎడారిగా ఉన్న ఎస్సారెస్పీ ఆయకట్టుకు స్వరాష్ట్రంలో అప్పటి సీఎం కేసీఆర్ కాళేశ్వరం నీటిని అందించారు. దాంతో 2017కు ముందు 55వేల ఎకరాలకు మించి వరి సాగు కాకపోగా తదనంతరం కాళేశ్వరం జలాల రాకతో 2.58 లక్షల ఎకరాలకు సాగు పెరిగింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, నిర్వహణ లోపంతో పంట విస్తీర్ణం తగ్గి ఈ యాసంగిలో 2.10 లక్షల ఎకరాల్లో సాగు కాగా అందులో కూడా చాలా ప్రాంతాల్లో పంట ఎండిపోతున్నది.

ఆత్మకూర్(ఎస్) మండలం పొట్లపహాడ్‌లో బీటలు వారిన వరిపొలం

కేసీఆర్ సర్కారులో ఎస్సారెస్పీకి జీవం

ఉమ్మడి రాష్ట్రంలో నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలోని హుజూర్‌నగర్ నియోజకవర్గం మొత్తం, కోదాడ, సూర్యాపేట నియోజకవర్గాల పరిధిలోని మెజారిటీ మండలాలు పచ్చని మాగాణిగా ఉండేవి. కానీ ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలోని తుంగతుర్తి నియోజకర్గంతోపాటు సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాల పరిధిలోని దాదాపు రెండున్నర లక్షల ఎకరాలు బీడుగా కనిపించేవి. ఇక్కడ వట్టిపోయిన చెరువులు, చుక్కనీరు అందించని బోర్లు, బావులతో రైతులు అరిగోస పడ్డారు. దాదాపు 25 ఏండ్ల క్రితం గోదావరి జలాలు తీసుకు వస్తామంటూ నాటి కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లా పరిధిలో ఎస్సారెస్పీ కాల్వలు తవ్వారు తప్ప నీళ్లు ఇచ్చిన దాఖలాలు లేవు. కేసీఆర్ సర్కారు అధికారంలోకి వచ్చిన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో ఎస్సారెస్పీ ఆయకట్టుకు జీవం వచ్చింది. అంతకుముందు బావులు, బోర్ల కింద 55వేల ఎకరాలకు మించి వరి సాగు కాకపోగా.. 2017 నుంచి కాళేశ్వరం జలాలు రావడంతో ఏటేటా సాగు పెరుగుతూ 2.58లక్షల ఎకరాలకు చేరుకున్నది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, ప్రాజెక్టుల నిర్వహణ లోపంతో ఆయకట్టు తిరోగమనంలోకి వెళ్లే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

పరుగులు పెట్టిన చోట నత్తనడకన

గత ఐదేండ్లుగా కాళేశ్వరం జలాలు జిల్లాలో పరుగులు తీయగా ప్రస్తుతం నత్తనడకన పారుతున్నాయి. గత సీజన్ వరకు కాల్వల ద్వారా 2.13లక్షల ఎకరాలకు ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిన పంట పొలాలకు 10 నుంచి 12 టీఎంసీల నీరు చేరింది. ఆయకట్టు పరిధిలోని సుమారు 450 చెరువులు, కుంటలను 1.5టీఎంసీలతో నింపడం ద్వారా మరో 45వేల ఎకరాలు స్థిరీకరణ జరిగింది. ఇప్పుడు పరిస్థితులు భిన్నంగా మారుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో కాల్వల ద్వారా 2,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా ఇప్పుడు 1,800 క్యూసెక్కులకు మించి రావడం లేదు. కాలువల ద్వారా కొంతమేర నీళ్లు విడుదల చేస్తూ చెరువులను నింపకుండా వదిలేస్తున్నారు. గతంలో వానకాలం సీజన్ పూర్తయి యాసంగి ప్రారంభమైనా కాళేశ్వరం ఆయకట్టు పరిధిలోని 450 చెరువులు జలకళను సంతరించుకొని ఉన్నాయి. అందులో 75 నుంచి 100 శాతం నీరు ఉన్న చెరువులు 370 ఉన్నాయి. కానీ ప్రస్తుతం 80కి మించి చెరువుల్లో నీరు లేదు. ఐదేండ్ల కాలంలో ఏనాడూ లేని విధంగా ఈ సారి 25 శాతం జలాలు ఉన్న చెరువులు 50 శాతం ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఈ సారి తుంగతుర్తి నియోజకవర్గంలో సాగు బాగానే ఉన్నప్పటికీ సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని ఆత్మకూర్.ఎస్, చివ్వెంల, పెన్‌పహాడ్‌తో పాటు కోదాడ నియోజకవర్గ పరిదిలోని మోతె, నడిగూడెం మండలాల్లో వందలాది ఎకరాల్లో వేసిన వరి పంట ఎండిపోతున్నది. ఆయా మండలాల్లో రైతులు తమకు ఉన్న భూమిలో వరి నాటు వేయగా నీరు సరిపడా రాకపోవడంతో కొంతమేర పశువులకు వదిలి, మిగిలిన పంటను కాపాడుకునేందుకు బోర్లు వేస్తూ నానా తంటాలు పడుతున్నారు.

కాళేశ్వరం నీళ్లు రాక పొలాలు ఎండిపోయాయి

కేసీఆర్ ప్రభుత్వంలో కాళేశ్వరం నీళ్లు రావడంతో పంటలు బాగా పండాయి. చెరువులు నీటితో కళకళలాడాయి. రైతులకు ఏ ఇబ్బందీ రాలేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో కాళేశ్వరం నీళ్లు రావడం లేదు. నాట్లు వేసిన పొలాలు వేసినట్లుగానే ఎండిపోతున్నాయి. చెరువుల్లో చుక్క నీరు లేదు. పంటకు పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం కాళేశ్వరం నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలి.

– మేకల జానయ్య, రైతు, కేశవాపురం, నడిగూడెం

మూడు ఎకరాలను పశువుల మేతకు వదిలిన

నాకు ఆరు ఎకరాల పొలం ఉంది. గత సంవత్సరం రెండు కార్లకు కాళేశ్వరం జలాలు రావడంతో ఆరు ఎకరాలు సాగు చేసిన. ఈ సంవత్సరం కూడా కాళేశ్వరం జలాలు వస్తాయని ఆరు ఎకరాల్లో వరి పెట్టిన. కానీ కాల్వల ద్వారా నీళ్లు రాకపోవడం లేదు. చెరువులు ఎండిపోయి భూగర్భ జలాలు తగ్గిపోయాయి. సాగుకు నీరు అందక మూడు ఎకరాల పొలం ఎండిపోయింది. ఎండిపోయిన పొలంలో పశువులను మేపుతున్నాం. ప్రభుత్వం నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలి.

– కేశబోయిన శ్రీశైలం, రైతు, పాతర్లపహాడ్ ఆత్మకూర్.ఎస్ మండలం

జాబ్ మేళాలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి, వేదికపై ఎంపీ బడుగుల, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి తదితరులు

ఏడాదిలోపు 2 లక్షల ఉద్యోగాలు భర్తీ

- ఎంజీయూ అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించాం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- మహాత్మాగాంధీ యూనివర్సిటీలో జాబ్‌మేళా ప్రారంభం

నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 26 : తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీస్ శాఖలో 13 వేల మందికి ఉద్యోగ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చామని, సంవత్సరంలోపు రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీలో సోమవారం తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్),ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎంజీయూ అభివృద్ధికి ప్రభుత్వం ఇప్పటికే రూ.100 కోట్లు కేటాయించిందన్నారు. ఎంజీయూలో ఖాళీల భర్తీని సీఎం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తానన్నారు. యువత ఎంప్లాయ్‌గానే కాకుండా ఎంప్లాయ్ క్రియేటర్‌గా ఎదుగాలని సూచించారు. చదువుకుంటేనే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని, తల్లిదండ్రులకు భారం కాకుండా ఉండాలంటే ఉద్యోగం సాధించి పేదరికం నుంచి బయటపడాలని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ చేసుకొని ఉద్యోగాన్ని సాధించి టాలెంట్ నిరూపించుకోవాలని, తన కూతురు కూడా జాబ్ సంపాదించుకున్నాక మరో 150 మందికి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదిగిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నెలా వివిధ కంపెనీలతో జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ జాబ్ మేళాలో ఉద్యోగం పొందిన వారికి రూ. 10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు ప్యాకేజీ ఉందని తెలిపారు. ఉద్యోగాల కోసం ప్రిపేర్ అయ్యే యువతకు ప్రతీక్ ఫౌండేషన్ అధ్వర్యంలో ఉచితంగా మెటీరియల్ పంపిణీ చేస్తామన్నారు. ఎంజీ యూనిర్సిటీని తెలంగాణలోనే బెస్ట్ యూనివర్సిటీగా తీర్చిదిద్దుతానని చెప్పారు. ఈ జాబ్ మేళాకు 12 వేల మంది యువత రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, 127 కంపెనీలు 12,733 ఉద్యోగాలు కల్పించనున్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఎస్పీ చందనా దీప్తి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎంజీయూ వైస్ చాన్స్‌లర్ గోపాల్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఆల్వాల రవి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, నల్లగొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, ప్లేస్మెంట్ అధికారి ప్రశాంతి, టాస్క్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు హాజరైన యువత

ఆరింతలు తగ్గిన నల్లగొండ మున్సిపల్ బడ్జెట్

- గతేడాది రూ.719.23 కోట్లు.. ఈ సంవత్సరం రూ.125.78 కోట్లు
- ఏకగ్రీవ ఆమోదం తెలిపిన సభ్యులు
- పలు రకాల గ్రాంట్లను పరిగణనలోకి తీసుకోలేదన్న చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నీలగిరి, ఫిబ్రవరి 26 : దినదినాభివృద్ధి చెందుతూ ఆర్థిక ప్రగతి సాధించేందుకు ప్రభుత్వ యంత్రాంగాలు ముందుకు సాగుతుంటే నల్లగొండ మున్సిపాలిటీ మాత్రం ప్రగతికి నిధుల కేటాయింపులు తగ్గిస్తూ వెనక్కి వెళ్తున్నది. గత రెండు మూడు పర్యాయాలుగా ప్రతియేటా ఆర్థిక పరిస్థితిని పెంచుకుంటూ పోతున్న నల్లగొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చైర్మన్ స్థానాన్ని తీసుకొని రూపకల్పన చేసిన బడ్జెట్‌లో దాదాపు ఆరింతల కోత పెట్టారు. రూ.719.23 కోట్లతో ఉన్న బడ్జెట్‌ను కేవలం రూ.125.78 కోట్లతో ఆమోదింప చేసుకున్నారు. 2022-23లో మున్సిపల్ బడ్జెట్ రూ.342.53 కోట్లు, 2023-24లో రూ.719.23 కోట్లు కాగా ఈ సంవత్సరం కేవలం రూ.125.78 కోట్లకు పరిమితమైంది. బడ్జెట్‌ను నాలుగు భాగాలుగా విభజించి తగ్గించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గత బడ్జెట్‌లో అమృత్, ఎస్‌డీఎఫ్, టీఎఫ్ఐడీసీ నుంచి వచ్చే నిధులు బడ్జెట్‌లో చూపించడం వల్ల, పెరిగిందని, అందులో 10 శాతం నిధులు గ్రీనరీకి పెట్టాల్సి వచ్చేదని అన్నారు. ఇవి ఖర్చు చేయకపోవడం వల్ల అధికారులకు ఇబ్బందులు వస్తున్నాయని, అందుకే అలాంటి నిధులను బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మున్సిపల్ సమస్యలను లేవనెత్తారు. ఆస్తి పన్ను, నల్లా బిల్లులు, ఇతర మున్సిపాలిటీ ఆదాయలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. వసూలు చేసిన పన్నులను వార్డుల వారీగా కేటాయించి ఖర్చు చేయాలని సూచించారు. పాతబస్తీ ప్రాంతంలో ఎప్పుడో కేటాయించిన ఇండ్లకు ఇంకా పాత యాజమానుల పేర్లే వస్తున్నాయని వాటిని తొలగించాలని బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్ సభ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్‌గౌడ్, బీజేపీ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్, కౌన్సిలర్లు యామ కవితాదయాకర్, మారగోని భవానీగణేశ్, ఫర్జానా ఫర్హత్ ఇబ్రహీం, అలకుంట్ల రాజేశ్వరీమోహన్‌బాబు, ఖయ్యూంబేగ్, బోయిన పల్లి శ్రీనివాస్, ఎడ్ల శ్రీనివాస్, కొండూరు సత్యనారాయణ పాల్గొన్నారు.

రంగం	2022-23	2023-24	2024-25
1. పన్నుల రాబడి(ఆస్తిపన్ను, అసెస్‌మెంట్స్)	22.11	27.91	28.91
2. పన్నేతర రాబడి	5.72	47.00	4.20
3. పన్నేతర రాబడిలో అద్దె/వివిధ కార్యక్రమాలు	3.98	7.95	7.54
4.ప్రజారోగ్యం/పారిశుధ్యం ద్వారా	1.79	1.86	1.80
5. ప్లానింగ్ సెక్షన్	14.51	16.65	16.76
6. ఇంజినీరింగ్ సెక్షన్	3.32	6.56	5.99
డిపాజిట్, అడ్వాన్స్ రుణాలు	5.72	4.70	4.20
నాన్ ప్లాన్ గ్రాంట్స్	9.91	15.02	14.66
ప్లాన్ గ్రాంట్స్	82.49	571.05	22.14
ఇతర గ్రాంట్స్ ద్వారా	42.76	133.16	88.98

వన్య ప్రాణుల సంరక్షణకు చర్యలు

- నల్లమల అటవీ ప్రాంతాన్ని పరిశీలించిన ఎఫ్‌డీఓ సర్వేశ్వర్

పాలపేడ అటవీ ప్రాంతంలో సాసర్ పిట్‌ను పరిశీలిస్తున్న ఎఫ్‌డీఓ సర్వేశ్వర్

చందంపేట ఫిబ్రవరి 26 : వేసవి దృష్ట్యా అటవీ ప్రాంతంలో వన్య ప్రాణుల సంరక్షణకు అటవీ శాఖ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఎఫ్‌డీఓ సర్వేశ్వర్ తెలిపారు. చందంపేట మండలంలోని పెద్దమూల, చిత్రియాల, రేకులవలయం, కంబాలపల్లి, పాత కంబాలపల్లి గ్రామాల సమీపంలో సోమవారం వన్య ప్రాణుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన సాసర్ పిట్స్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంబాలపల్లి రేంజ్ పరిధిలో వన్య ప్రాణులు వేసవిలో నీటి దప్పిక తీర్చుకునేందుకు సాసర్ పిట్స్‌లో నీటిని నింపుతున్నామని తెలిపారు. నల్లమల అటవీ ప్రాంతంలో 46 సాసర్ పిట్స్, 15 నీటి కుంటలు ఉన్నాయని చెప్పారు. నీరు నిల్వ ఉండే ప్రాంతంలో బయటి వ్యక్తులు ప్రవేశించరాదని హెచ్చరించారు. వన్య ప్రాణులను వేటాడినా, అక్రమంగా కలపను తరలించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట ఎఫ్ఆర్‌ఓలు సాయిప్రకాశ్, భాస్కర్, సెక్షన్ ఆఫీసర్లు రాగ్యానాయక్, సైదులు, శ్రీదేవి, బీట్ ఆఫీసర్లు చంద్రకళ, ప్రీతి ఉన్నారు.

ఏషియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో అనిల్‌కు 4 పతకాలు

పతకంతో అంబోజు అనిల్‌కుమార్

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 26 : ఈ నెల 22 నుంచి 25 వరకు థాయ్‌లాండ్ సకన్ నకన్ జిల్లాలో జరిగిన 28వ ఏషియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ -2024లో జిల్లాకు చెందిన హెడ్ కానిస్టేబుల్ అంబోజు అనిల్‌కుమార్ 45 సంవత్సరాల విభాగంలో నాలుగు పతకాలు సాధించారు. 400 మీటర్ల రిలే విభాగంలో బంగారు పతకం, 800 మీటర్లు, 1500 మీటర్లు, 5000 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకాలు పొందారు. ఈ మేరకు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి కె.ధనంజనేయులు ఒక ప్రకటనలో ఆయనకు అభినందనలు తెలిపారు. అనిల్‌కుమార్ గత సంవత్సరం ఏషియన్ మాస్టర్ సౌత్ కొరియాలో 3000 మీటర్ల విభాగంలో గోల్డ్ మెడల్, 800 మీటర్ల విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించారు. రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధించి జిల్లాకు పేరు తీసుకురావాలని ధనంజనేయులు కోరారు.